కథ

# వయసుగతి ఇంతే!

-తురగా జానకీరాణి

ఈ వేళ సంగతి ఏమిటో తేల్చేయాలి' అనుకుంది సుందరి. అంత దగ్గరి స్నేహితురాలు సరోజ, ఆదివారం నాడు పెళ్ళిలో కలసినప్పుడు ఏమన్నది? "ఏమోయి సుందరీ, పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. ఓ కన్నేసి కని పెట్టి వుంటున్నావా"? అన్నది. ఎందుకంటుంది అల్లా కారణంలేకుండా. తనకి ఒక కూతురు, కొడుకు - సరోజకీ ఒక అమ్మాయి, అబ్బాయి. ఇంచుమించు ఒకే వయస్సువాళ్ళు, ఆమెకి పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారన్న ధ్యాస కలిగిందంటే బలమైన కారణం వుండాలి.

ఆదివారం పొద్దున్న సరోజ ఆ హెచ్చరిక చేయడమేమిటి? ఆ సాయంత్రమే ఆరున్నరకి, నందూగాడు ఫెళఫెళ మనే మోటరు సైకిలుమీద, రెపరెపలాడే ఎర్ర డ్రెస్సు వేసుకున్న పిల్లని కూర్చోబెట్టుకుని, వెళ్ళిపోతూ తనకు కనబడటమేమిటి - బుర్రమీద దెబ్బవేసినట్టు అసలు సంగతి అర్థమైంది. ఆ పిల్ల కుదురుగా, అంటీ అంటనట్లుగా కూర్చుందా - అబ్బే వాడిని అతుక్కుని పోయి, వేలాడిపోతూ కూర్చోడమేకాక పెరిగిన వాడి గడ్డానికి నోరు ఆనించి అరుస్తోంది. ఆ అరుపులకి రోడ్డుమీదవాళ్ళు తలతిప్పి చూస్తున్నారు.

సుందరి ముఖం ఎర్రబడింది. మనస్సు భగ్గుమంది. కనురెప్పలు వాలడం మర్చిపోయి, స్తంభించి పోయాయి. ఫుట్‌పాత్ మీద పళ్ళు కొంటూ, సాక్షాత్తూ మాతృశ్రీ వుందని, ఆ నందూగాడికి తెలిస్తేనా? ఎవర్నీ గమనించే స్థితిలోలేకుండా వెళ్ళిపోయింది - నలభై వేలుపోసి, నందూగాడి కన్నతండ్రి కొనుక్కున్న బండీ - ఆదివారం రాత్రి ఆబండి స్వంతదారుడైన తన భర్తతో ఏమన్నా అనాలన్నా భయమే - 'నీగారమే వాడిని పాడు చేస్తోంది' అని ఎదురు చీవాట్లు తగులుతాయని. ఇప్పుడింక సోమవారం తెల్లవారింది. ఇంట్లోతనూ, ఉదయం రౌండ్సుమీద వచ్చే తెల్లపిల్లీ తప్పితే మరో అలికిడి వుండదు. పిల్లలకీ, వాళ్ళ తండ్రికీ కూడా చికిత్సకు లొంగని భయంకరమైన నిద్రజబ్బు. సుందరి కాఫీతాగి, ఎన్నో పనులు చక్కబెట్టుకుని శుచిగా, శుభ్రంగా తెమిలిపోయి కూర్చుంది. రేడియోలో సంగీతం - "రఘువంశ సుధాంబుధిచంద్ర" అని -. కదన కుతూహల రాగంలో కీర్తన - బ్రహ్మాండంగా పాడేస్తున్నారు. మనవంశ సముద్రానికి చంద్రుడు ఈ నందుగాడు కదా అని టక్కున తోచింది సుందరికి. వంశచంద్రులకి కూడా గర్ల్‌ఫ్రెండ్స్ అనే బలహీనత వుండవచ్చునా? అల్లాంటిమచ్చ - దుర్గుణాలుంటే కూడా, వాడిని చంద్రుడి పోస్టులో వుంచవచ్చునా? అనే సందేహాలు వచ్చాయి సుందరికి. ఆ కాలంవేరు. ఈ కాలంవేరు అని తోసేసి ఇంట్లో ముగ్గురూ సుషుప్తిలోంచి ఎప్పుడు బైటకు వస్తారా అని. ఎదురుచూడసాగింది. పిల్లిసంగతి సరేసరి, బ్రేక్‌ఫాస్ట్‌కి ఒక ఎలుక సరిపోక, మరోదానికోసం గూటిపక్కన నక్కికూర్చుంది.

- అదృష్టం, ముందుగా నందూయే నిద్రలేచాడు. లేవగానే, వాళ్ళఫ్రెండ్సు లాగానే 'కాఫీ' అని గావుకేక పెట్టేవాడు నిన్న మొన్నటివరకు. పళ్ళుతోముకోందే యివ్వను అని, సుందరి గట్టిగాచెప్పి, అమలు చేయడం వల్ల, నిశ్శబ్దంగా వెళ్ళి పళ్ళుతోముకొని, కాళ్ళుకడుక్కొని మరీ వస్తున్నాడు వంటింట్లోకి. ఈ వేళపొద్దున్న సుందరి చేత్తో నుదుటిమీద కొట్టుకుంది. "అయ్యోరాత చిన్న విషయాల్లో దారిలో పెట్టేశానన్న సంబరం ఏడిసినట్లుంది. పెద్దవిషయాల్లో వాడిష్టం వాడిదిగా వుంది. పరువు పోయే విషఘుడియ వచ్చింది కదా" - అని బాధపడింది. కాఫీతాగి, మేడమీది వారి కాలికింద భూమి అదిరే సౌండుతో ఇంగ్లీషుపాటలు పెట్టేసి, పేపర్లన్నీ నేలమీద పరిచేసి, నందూ చిదానందంగా వున్న సమయంలో, "ఎవర్రా ఆ అమ్మాయి - నీతో నిన్న ఆ మోటారు సైకిల్ మీద?" అంది సుందరి మృదువుగా.

అందమైన ముఖం ఎత్తి అమ్మవంక చూసి, "ఏ అమ్మాయి"? అన్నాడు. "ఓహో! ఆ అమ్మాయా! స్వీటీ అని నా ఫ్రెండు "అని జవాబిచ్చి పరధ్యానంలో పడ్డట్టు తీవ్రంగా ఈలవేయడం ఆరంభించాడు.

"స్టాపిట్! ఏదో అమ్మ అడుగుతోందని లేకుండా ఏమిటా నిర్లక్ష్యం?" అనగానే, నందూలేచి వెళ్ళి స్టీరియో ఆపేసి, న్యూస్ పేపర్ కాగితాలన్నీ బొత్తిపెట్టి చేతులు కట్టుకుని: "అడుగు అమ్మా!" అన్నాడు. పిల్లలు మమ్మీ అని పిలవకుండా సుందరి చిన్నప్పట్నించి జాగ్రత్త పడింది.

"ఫ్రెండయితే మాత్రం అల్లా - అల్లా కూర్చుందేమిటి?" అందీ - వాటేసుకుని అనలేక -

"ఎల్లా కూచుంది? బండిస్పీడుగా పోతోంటే పడిపోకుండా కూర్చుంది" అన్నాడు కళ్ళు తిప్పుతూ,

"ఒరేయ్! నేను నాన్నగారి వెనక అల్లాగే కూర్చుంటున్నానా?" అన్నది. "నువ్వు - నువ్వు" అని "నీ కంటే స్వీటీ సన్నగా వుంటుంది" అని ముగించాడు నందు. ఛీ - పాతాళమనేది వుంటే, దేహభారంతో కాకపోయినా, అవమాన భారంతో అందులో పడిపోవాలి అనుకుంది సుందరి.

" నందూ, నేను చాలా సీరియస్‌గా చెబుతున్నాను. నువ్వు అమ్మాయిలతో స్నేహంగా వుండడానికి వీల్లేదు. నీ వయస్సేమిటి? నీ చదువేమిటి? - అల్లరి చిల్లరి వేషాలు వేసేసి నెగ్గిపోగల ననుకుంటే కుదరదు" అంది.

"బాగా చెప్పావమ్మా! బుద్ధిగా చదువుకోమని. అల్లా గడ్డిపెట్టు", అనే డైలాగుతో ప్రవేశించింది సుజాత- నందు కంటే రెండేళ్ళు చిన్నది. ఇంటర్మీడియెట్ విద్యార్థిని.

"సుజ్జీ! నీ లిమిట్స్‌లో నువ్వుండు. పెద్దవాళ్ళ విషయాల్లో కలగజేసుకోకు" అన్నాడు.

" అమ్మా! వీడు స్వీటీతో తిరుగుతున్నాడని వాళ్ళన్నయ్య వీడిని పచ్చడి చేస్తానన్నాడుట. కాలో, చెయ్యో విరకొట్టేస్తారు. వాళ్ళు అసలే మంచి వాళ్ళు కాదు. అందుకనే చెప్పాను" అంది సుజాత.

"ఏయ్ సుజ్జీ! కట్టుకథలు చెప్పి, అమ్మను కంగారు పెట్టావంటే చంపేస్తా. అసలు నీ సంగతులన్నీ చెప్పానంటే అమ్మకి హార్ట్ ఆగిపోంతుందని ఇంతకాలం ఊరుకున్నాను. అమ్మా - ఇది - ఈ సుజ్జీ అసలు..." అంటూ మొదలుపెట్టాడు.

సుందరికి హార్టు ఆగేంతపనీ అయిపోతోంది. ఏమిటీ పిల్లలు - నాలుగు వాక్యాల్లో నలభై సంగతులు బయటపెట్టేస్తున్నారు? సుజాత భయంగా కళ్లు తిప్పింది. కానీ సర్దుకుని, "ఏమిట్రా నువ్వు చెప్పేది? నా సంగతులేమిటి? అమ్మా - వీడు అస్సలు కాలేజికి వెళ్లడమ్మా అప్పులు కూడ చేసేస్తున్నాడు" అంది.

నందూ నిలబడి, సుజాత దగ్గరగా వెళ్ళి చెయ్యి గట్టిగాపట్టుకున్నాడు. కొట్టేస్తాడేమోనని సుందరి కంగారు పడి, "ఏమిట్రా" అంటూగదమాయిస్తోంటే పిల్ల తండ్రి ప్రవేశించాడు.

"ఏమిటది? కురుక్షేత్రం? పొద్దున్నే శాంతంగా పడుకుందామంటే వీలుండదుకదా?! సుందరీ, ఏమి టది?" అన్నాడు.

మూడ్ మారిపోయింది. పిల్లలు, తల్లి కలిసి బాహ్య శక్తిని ఎదుర్కో వలసిన పరిస్థితి. సుజాత జుట్టు సర్దుకుని, నైటీ సరిచేసుకుంటూ నాన్న దగ్గర గారాలు పోవటానికి రెడీ అయింది.

ఆయన కూడా పెద్ద సమస్యలను అర్థం చేసుకోడానికి సాధారణంగా బద్ధకించే మనిషి. ఏదో రహస్యాలున్నాయని పసిగట్టినా, తన ప్రసక్తి లేదని, ప్రస్తుతానికి గందరగోళ పడనవసరం లేదని గుర్తించాడు. అందుకని, భర్త పాత్రలోనే కొనసాగుతూ, కాలిమీద కాలేసుకుని పేపరు చూస్తూ కాఫీకోసం ఎదురుచూడ్డం అభినయించాడు.

కాఫీ కలుపుతున్న సుందరికి మతిలేదు. ఈ పిల్లలిద్దరూ చెరో పెడదారి పట్టేస్తున్నట్టు తలలో ఆలోచన తొలిచేస్తోంది. స్వీటీ ఎవరు? నందుగాడికి అప్పులేమిటి? సుజాత గురించి నందు దగ్గర దాక్కున్న రహస్యాలేమిటి? అని ఆలోచనలతో, గోళ్ళు కొరుక్కోవడానికి, బుర్ర గోక్కోవడానికి, చేతులు ఖాళీ లేనందున మానసికంగానే ఆ పనిచేస్తోంది.

"సుజ్జీ"! అని గట్టిగా పిలిచింది. గట్టిగా అనుకున్నది. గానీ కంఠస్వరం మాత్రం తెల్లపిల్లి 'మ్యావ్' స్థాయిలో కూడా రాలేదు. 'రఘువంశ సుధాంబుధి' కీర్తన అయిపోయింది. "నానాటి బ్రదుకు నాటకమూ" కీర్తన వస్తోంది. తన పరిస్థితికి తనకే జాలి వేస్తోండగా "సుజ్జీ"! అంది మళ్ళీ.

"పిలిచావా అమ్మా" అంటూ లోపలకు వచ్చిన

సుజాత, కాఫీ, పాలు గ్లాసులు, కప్పులు అన్నీ తీసుకుని తల్లివంక ఒక 'లుక్' పారేసి వెళ్ళింది. వాళ్ళ నాన్న వెళ్ళే లోగా ఈ పిల్లలు తనకు విడిగా గానీ, జాయింట్‌గా గానీ దొరుకుతారేమో, కథ అంతా చెప్పిద్దామనుకుంది. ఏదీ, ఆయన ఆఫీసుకి లేటుగా వెడతారు లాగావుంది, చలనం లేదు. పిల్లలిద్దరూ మాత్రం డబుల్ స్పీడులో తయారై పోయారు. కొట్లాడుకున్న కుక్క పిల్లల్లాగ అంతకుముందే ప్రవర్తించామన్న సంగతి గుర్తున్నట్లుగా బ్రెడ్‌ముక్కలు కొరికారు.

నందు తన డొక్కు ద్విచక్ర వాహనం వదిలేసి, కొత్తమోటారు సైకిలు తాళంచెవి తీసుకెడుతున్నాడని వాళ్ళ నాన్న గ్రహించేలోపలే - "బై" అంటూ ఆయన బండిమీద వెళ్ళిపోయాడు.

ఎప్పుడు ఈ కథాంశాలు బయటపడేది - సరోజ తనలో వేసిన విషబీజాలు మొలకెత్తి, పిలకలై, రెమ్మలు, కొమ్మలు వేస్తున్నాయి. ఎవరితోనూ చెప్పుకోవడానికీ లేదు. బద్దలుకొట్టి బయటకు అనడానికీ లేదు. ప్రధాన పాత్రధారులిద్దరూ వంటికి ఆముదం రాసుకున్నట్లు పట్టుచిక్కకుండా జారిపోతున్నారు.

రెండురోజులు గడిచాయి. సుజాత స్పెషల్‌గా డ్రెస్సు వేసుకుని, అద్దంముందు గంటసేపు కూర్చుని, ముక్కు, ముఖం దిద్దుకొంది. నందూప్రతి అరగంటకి జుట్టు దువ్వుకొంటున్నాడు. ప్రతి పని స్పెషలుగా చేస్తున్నట్లు అనుమానం రావడం మొదలైంది.

ఎనిమిది కావస్తోంది. సుజ్జీ ఇంత వరకు ఇంటికి రాలేదు. నందు వచ్చి బండి లోపల పెట్టాడు. లోపలికి వస్తూనే, "ఏమిటమ్మా - అల్లావున్నావు?" అన్నాడు. సుందరి తన ఆత్రుతని మింగేసి, వాడి మీదకు అస్త్రం తిప్పి, "మీ ఇద్దరూ వున్న తీరుకి ఇంకెట్లా వుంటాను"? అంది.

యువనాయకునిలా ఇంట్లో ప్రవేశించిన అతని ముఖంలో చిన్న చీకాకు, "ఏమైందిప్పుడు? ఏంచేస్తున్నాం మేము?" అన్నాడు.

"కాలేజీ వదలగానే ఇంటికి రాకూడదా? ఎక్కడెక్కడో ఎవరెవరితోనో తిరుగుతుంటావు? అయినా ఎందుకురా కొంపమీదకు తెస్తావు? ఆ పిల్ల గొడవ నీకుదేనికి?" అన్నది.

నందూ ఊపిరి గట్టిగా తీసికొని వదిలాడు, "అమ్మా! నాకు అమ్మాయిలలో ఫ్రెండ్సు వుండకూడదా? అదొక ఫన్! సరదా! అసలు అమ్మాయిలు నాకు ఫ్రెండ్సుగా లేకపోతే నాకు అవమానం" అన్నాడు. సుందరికి ఛర్రునకోపం వచ్చింది.

"అంటే నీకు నలుగురిలో గ్లామరు కోసమని, ఒక పిల్లను నీతో తిప్పుకుంటావా! అల్లాతిప్పుకుంటే ఆమెను పెళ్ళి చేసుకునే ధైర్యం వుండాలి" అంది గట్టిగా.


నందు చిన్నగా నవ్వాడు, "పెళ్ళి ఎల్లాచేసుకుంటాను? నాలుగురోజులు స్నేహంగా తిరిగితే. పెళ్ళి చేసేసుకుంటారా? పిల్లీ!" అన్నాడు.

"ఆ అమ్మాయి గతి ఏమిటి? వీడితో తిరిగిందని అందరూ అనుకుంటే ఆ అమ్మాయి పెళ్ళి ఎల్లాగవుతుంది?" అంది. మాటకి మాట చెప్పేంత పెద్దవాడు వీడు అని అర్థమైంది.

"ఆ ఆలోచన స్వీటీకి వుండాలిగా! ప్రస్తుతం సరదాగా రోజులు గడుపుతాం - పెళ్ళిసంగతి, టైము వచ్చినప్పుడు ఆలోచిస్తాను. తన ఆలోచన తనది" అన్నాడు ఖచ్చితంగా.

"అంటే - నీ పెళ్ళి సంగతి - నువ్వు..." అని ఆగింది సుందరి. ఎంత విసుగో నందుకి. తెలివి తక్కువ అమ్మకి ఎల్లా ఈ విషయాలు బోధపరచడం అన్నట్లుగా ముఖంపెట్టి -

"నేను ఆలోచించుకోనమ్మా! నువ్వే అమ్మాయిని తెస్తావు. నేను పెళ్ళి చేసుకుంటాను. సరేనా! అదెప్పటి సంగతో! ఇప్పుడే ఇంతరాద్ధాంతందేనికి?" అన్నాడు.



సుందరి మనస్సులోని అసలు ఆత్రుతకి, కంగారుకి కారణమైన పిల్ల సుజాత, గేటుముందు ఆగిన కారులోంచి దిగింది. డ్రైవరు సీటుదగ్గరకి వచ్చి, కారు నడుపుతున్న అబ్బాయితో కబుర్లుచెప్పి, టాటాలు చెప్పి లోపలకు వచ్చింది. కారు వెళ్ళిపోయింది. కారు వెడుతోంటే నందు గేటు దగ్గరకు వెళ్ళాడు. చెల్లిని లోపలకు వెంట పెట్టుకుని వచ్చాడు.

"ఏమిటమ్మా? కంగారుగా ఎదురు చూస్తున్నావేమిటి? తొమ్మిదికూడా కాలేదు ఇంకా" అంది సుజాత, మంచివేగంతో ఇంట్లోకి వస్తూ, కళ్ళల్లో మెరుపు, కాంతి తొనిగనిగలాడే ముఖం.

"ఏరావిన్నావా? నీ చెల్లెలు కూడా ఎవరితోనో షికార్లుకొట్టి వస్తోంది," అంది సుందరి, తన సంస్కారాన్ని గొంతు తీవ్రతలోనే నొక్కిపట్టి.

నందూ ఇందాకటి వలె ఉత్సాహంగా లేడు. బేఫికరుగా లేదు అతని చూపు. "సుజ్జీ - ఎవరతను? ఎక్కడికెళ్ళావు? అమ్మ ఎంత కంగారు పడుతోంది?" అన్నాడు.

"ఔను - పనుండి వెళ్ళాను. పార్టీ - ఆ తర్వాత కాస్సేపు ట్యాంకుబండ్ మీద కూర్చున్నాం. తప్పా అన్నయ్యా?" అంది. చెట్టంత అమ్మ అక్కడే వున్న సంగతి వాళ్ళకి అక్కర్లేనట్లు మాటలు.

"నాకు చెప్పమ్మా నీ విహారాలేమిటో, అతనితో నీకు స్నేహం ఏమిటి? ఎంతవరకు వచ్చింది - ఎవర్నడిగి పొద్దుపోయే వరకు తిరుగుతున్నావు?" నిప్పులు కురవడం ఒకటే తరువాయి సుందరి మాటల్లో.

"ఏమిటమ్మా - అంత సీరియస్‌గా, ఒకరికొకరం నచ్చితే, పెద్దవాళ్ళని ఒప్పించి..." అంటోంది మెల్లిగా సుజాత.

సుందరి తల తిరిగిపోయింది. కిందపడిపోయేదే, "పెద్దవాళ్ళతోచెప్పి పెళ్ళి చేసుకుందామనుకుంటున్నావు? నీకు ఇంకా మైనారిటీ వెళ్ళలేదని తెలుసా"? అంది.

సుజాత బెంబేలుగా చూసింది. నందు కలుగజేసుకుని, "అదికాదు సుజ్జీ! అతను ఎల్లాంటివాడో, మనకి పూర్తిగా తెలియకుండానే..."

"మీరిద్దరూ అల్లాకూచోండి. ఏరా, స్వీటీకి ఒక నీతి, సుజ్జీకి ఒకనీతి, నీకు ఒక రూలు, కారుకుర్రాడికి ఒక రూలూనా? నువ్వు తిరిగినా ఫరవాలేదు, ఆ అమ్మాయి గతి ఆమే చూసుకుంటుంది, కానీ నీ చెల్లెలు మాత్రం - నీ అధీనంలో వుండాలి..." అసలు గొడవ మర్చిపోయానని గ్రహించింది.

"ఇప్పుడు చెబుతున్నాను. మీరు దాచాలని ప్రయత్నించలేదు. సంతోషం. మరీ కూరుకుని పోకముందే, నా దృష్టిలో పడ్డారు. మరీ ఆనందం. మీకు చదువులు కావాలి. సంపాదనరావాలి. అందాకా ప్రేమ, పెళ్ళి - అంటే చంపేస్తా" అంది.

ఇద్దరూ తెలివైన పిల్లలు. గ్రహించారు. నందువచ్చి అమ్మకాళ్ళ దగ్గరకూర్చున్నాడు.

"అమ్మా! నాకు అమ్మాయిలు, సుజ్జీకి అబ్బాయిలు ఫ్రెండ్సు వుండకూడదా? అది అవినీతా"? అన్నాడు.

సుందరి జవాబు చెప్పలేకపోయింది.

"కాదు, స్నేహం ఎక్కడముగిసి, ప్రణయంగానీ, ఒకరి నొకరు లోకువకట్టి దోచుకోవడం ఎక్కడ ఆరంభమౌతుందో, నీకు తెలిస్తే, ఫరవాలేదు చిట్టితండ్రీ!" అంది తల మీద చేయివేసి.

"తల్లీ! చిన్నప్పుడు ఈ చిన్నమెట్టుదిగుతూ కూడా, నువ్వుపడతావని జాగ్రత్త చెప్పేదాన్ని, పక్కనే వుండి, చిన్ని చేయి పట్టుకుని నడిపించే దాన్ని, అదేనమ్మా - నేనిప్పుడూ చేసేపని. కానీ జీవితంలోని ఈ ఘట్టం చాలా సీరియస్‌గా తీసుకోవాలి" అంది సుందరి. అడ్వర్టైజుమెంటులోని ఫోటోలాగా, తల్లి, పిల్లలు ఒకరి దగ్గరగా ఒకరు జరిగిపోయి, కువకువలాడారు.

కారులోని ఆ కుర్రవాడు, సరోజ కొడుకేనని, ఆ తర్వాత తెలిసింది సుందరికి. ఓ కన్నేసి, కనిపెట్టి వుంటున్నదో లేదో అడిగి తెలుసుకోవాలి - అనుకుందిఆమె.

—(ఆకాశవాణి ప్రసారితం)